క్లుప్తంగా

మరిడమ్మకు ప్రత్యేక పూజలు

పెద్దాపురం: కోరిన కోర్కెలు తీర్చే ఇలవేల్పుగా పేరొందిన పెద్దాపురం మరిడమ్మ ఆలయంలో అమ్మవారికి శుక్రవారం బంగారు, వెండి పుష్పాలతో పాటు పంచామృతాభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అసిస్టెంట్ కమిషనర్ విజయలక్ష్మి ఆధ్వర్యంలో ఈ పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

హజ్ యాత్రికులకు సత్కారం



హజ్ యాత్ర ముగించుకుని వచ్చిన వారిని సత్కరిస్తున్న మత పెద్దలు

పెద్దాపురం: పట్టణ వైఎస్సార్ సీపీ నాయకుడు, అగ్రో మాజీ డైరెక్టర్ సయ్యద్ జానీ కుటుంబీకులు హజ్ యాత్రను ముగించుకుని సొంతూరుకు వచ్చిన సందర్భంగా శుక్రవారం పెద్దాపురం పట్టణ ముస్లింల సమక్షంలో ఘనంగా సత్కరించారు. స్థానిక కవాడి వీధి జానీ కుటుంబానికి చెందిన మహబూబ్ షరీఫ్, రహమతుల్లా, షేక్ మదీనా షరీఫ్‌లు మక్కా యాత్రను ముగించుకుని పెద్దాపురం పట్టణానికి వచ్చారు. దీంతో వారిని స్థానిక జామీయా మసీద్ సోదరులు సత్కరించారు.

వీధులు జలమయం



మూలపేటలో ఇళ్ల మధ్య నిలిచిపోయిన వర్షపు నీరు

కొత్తపల్లి: వర్షానికి మూలపేటలో రోడ్లన్నీ జలమయమయ్యాయి. పల్లపు ప్రాంతాలన్నీ నీటితో నిండిపోయాయి. ప్రకాష్‌నగర్–2 ఆంజనేయస్వామి ఆలయ సమీపంలో వర్షపు నీరు పోయేందుకు మార్గం లేక సుమారు మోకాలు లోతు నీరు నిలిచిపోయింది. పారిశుధ్య పనులు సక్రమంగా లేక జ్వరాలు విజృంభిస్తున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పంచాయతీ అధికారులకు ఎన్నిసార్లు మొరపెట్టుకుంటున్నా పట్టించుకోవడం లేదని అంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పారిశుధ్య పనులు చేపట్టి దోమలను నివారించాలని కోరుతున్నారు.

నట్టల నివారణ మందు పంపిణీ



నట్టల నివారణ మందు పంపిణీ చేస్తున్న అధికారులు, నేతలు

పిఠాపురం: ఈ నెల 26 నుంచి వచ్చే నెల 10వ తేదీ వరకూ గొల్లప్రోలు మండలంలో గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందు పంపిణీ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చేబ్రోలు పశు వైద్యాధికారి ప్రశాంత్ తెలిపారు. చేబ్రోలులో శుక్రవారం సుమారు వెయ్యి గొర్రెలు, మేకలకు ఈ మందు వేశారు. మండలంలో సుమారు 12 వేల జీవాలకు నట్టల నివారణ మందు వేయనున్నట్లు ఆయన తెలిపారు.

వంతెన నిర్మాణ పనుల పరిశీలన



జమునా నగర్ కాలనీని కలుపుతూ వంతెన నిర్మాణ పనులు

సామర్లకోట: స్థానిక కాకినాడ రోడ్డులో మాధవపట్నం శివారు జమునానగర్ కాలనీని కలుపుతూ వంతెన నిర్మాణ పనులు జోరుగా సాగుతున్నాయి. జమునానగర్‌కు వెళ్లడానికి సరైన మార్గం లేక ఆ ప్రాంత ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. దాంతో వెస్ట్ డ్రైన్‌పై వంతెన నిర్మించడానికి రూ.70 లక్షలతో ఉపాధి హామీ నిధులు మంజూరు చేశారు. ఆ పనులను మండల ఇంజినీరింగ్ అధికారులు శుక్రవారం పరిశీలించారు.

ఆలయ భూములకు కౌలు వేలం

కాకినాడ రూరల్: సర్పవరంలోని రాజ్యలక్ష్మీ సమేత భావనారాయణ స్వామివారి ఆలయ భూములకు శుక్రవారం ఆలయ ప్రాంగణంలో వేలం పాటలు నిర్వహించినట్లు ఈఓ మాచిరాజు లక్ష్మీనారాయణ తెలిపారు. శ్రీమంత్రిప్రగడ వారి సత్రం గ్రేడ్–1 ఈఓ సుబ్రహ్మణ్యం పర్యవేక్షణలో మొత్తం 26.85 ఎకరాలకు గాను వేలం పాటలు నిర్వహించగా రూ.8.45 లక్షల ఆదాయం లభించిందని, గతం కంటే రూ.2.70 లక్షలు పెరిగిందని ఆయన తెలిపారు. వేలం పాటకు సంబంధించి భూముల వివరాలు ఇలా ఉన్నాయి. జగ్గంపేట మండలం రాజపూడి గ్రామంలో 2.70 ఎకరాలకు గాను రూ.36 వేలకు, పిఠాపురంలో 4.62 ఎకరాలకు గాను రూ.90 వేలు, గొల్లప్రోలు మండలం ఎ.వి జయనగరంలో రూ.65 వేలకు, సర్పవరంలో భూమికి రూ.3.02 లక్షలు, ఇదే గ్రామంలో మరో సర్వే నంబర్లలోని భూమికి రూ.3.52 లక్షలు వేలం ద్వారా వచ్చింది.

అదిగో.. ఇదిగో అంటూ..

- పవన్ ఇలాకాలో దళితులకు దగా
- ఏడాదిగా అభివృద్ధి పనులకు ఆమోదం తెలపని అధికారులు
- పెండింగ్‌లో రూ.1.20 కోట్ల విలువైన పనులు



పిఠాపురం ఒకటో వార్డులో అధ్వానంగా డ్రైన్



అగ్రహారంలో రోడ్డుపైకి చేరిన మురుగునీరు



పిఠాపురం అగ్రహారంలో మురుగు కాలువ ఇలా..

పిఠాపురం: సమస్యలెన్నో వెంటాడుతున్నాయి.. వాటి పరిష్కారానికి నిధులూ అందుబాటులో ఉన్నాయి.. అయితే పనులు చేయించడానికి ఆమోదం తెలపక అభివృద్ధికి గ్రహణం పట్టింది.. ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ నియోజకవర్గం పిఠాపురంలో దళిత వాడల పరిస్థితి ఇది. కౌన్సిల్ ఆమోదించినా అధికారులు ఆ పనులకు ఆమోదం తెలపకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. కేవలం కూటమి నేతల ఒత్తిడితోనే అధికారులు ఆ పనులను ఆపేశారంటూ పలువురు ఆరోపిస్తున్నారు. దళితవాడల అభివృద్ధికి తాను కృషి చేస్తానని చెప్పిన ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ ఇలాకాలో ఇలాంటి ఘటనపై అంతా నివ్వెరబోతున్నారు.

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో దళిత వాడల అభివృద్ధికి నాబార్డు నిధులు రూ.1.20 కోట్లు కేటాయించారు. పిఠాపురంలో దళితవాడ అయిన అగ్రహారం 1, 30 వార్డుల్లో మౌలిక సదుపాయాలైన రోడ్లు, డ్రైన్లు వంటి పనులు చేయడానికి ప్రతిపాదనలు చేయగా అప్పట్లో కౌన్సిల్ ఆమోదం తెలిపింది. అయితే ఎన్నికలు రావడంతో వాటిని ప్రారంభించలేదు. కూటమి ప్రభుత్వం వచ్చాక ఆయా పనులను ప్రారంభించ లేదంటూ రద్దు చేశారు. అనంతరం మళ్లీ ఆ పనులను కౌన్సిల్ సమావేశానికి తీసుకురాగా, 10 మంది టీడీపీ, జనసేన కౌన్సిలర్లు వ్యతిరేకించగా 18 మంది కౌన్సిలర్లు ఆమోదించడంతో ఆ పనులు ఆమోదం పొందాయి. ఇది జరిగి నెలలు గడుస్తున్నా మున్సిపల్ అధికారులు మాత్రం వాటికి వర్క్ ఆర్డర్లు ఇవ్వకుండా తాత్సారం చేస్తుండడం పలు అనుమానాలకు తావిస్తోంది. పలువురు దళిత కౌన్సిలర్లు అధికారుల వద్దకు వెళ్లి అడుగుతున్నా అదిగో ఇదిగో అంటూ కాలయాపన చేయడం వెనుక కూటమి నేతల ఒత్తిడి ఉందన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ప్రస్తుతం వైఎస్సార్ సీపీ నేతలు మున్సిపల్ పాలకవర్గంగా ఉండడంతో వారు ఆమోదించిన పనులు చేయకూడదని కూటమి నేతలు ఒత్తిడి తెస్తున్నట్లు చెప్పుకుంటున్నారు. అందులోనూ దళిత వాడల్లో అభివృద్ధి జరగకూడదని అడ్డు తగులుతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ విషయమై వివరణ కోరేందుకు ప్రయత్నించగా అధికారులు అందుబాటులో లేరు.

అభివృద్ధికి అడ్డుతగులుతున్నారు

ఎన్నో ఏళ్లుగా మా ప్రాంతం అభివృద్ధికి నోచుకోలేదు. మా వార్డుల్లో అభివృద్ధి పనులకు గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం నాబార్డు నిధులు రూ.1.20 కోట్లు కేటాయించింది. పనులు ప్రారంభించే సమయానికి ఎన్నికలు రావడంతో ప్రారంభం కాలేదు. ఎన్నికల అనంతరం ప్రస్తుత ప్రభుత్వం మా వార్డుల్లో కేటాయించిన పనులను రద్దు చేసింది. అయినప్పటికీ మేము మళ్లీ కౌన్సిల్ దృష్టికి తీసుకెళ్లి ఆమోదం పొందాం. అయినా మా పనులు చేయనివ్వడం లేదు. దీనిపై ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పట్టించుకోకపోవడం సరికాదు.

– వజ్రపు శైలజా రాజశేఖర్,
1వ వార్డు కౌన్సిలర్, పిఠాపురం అగ్రహారం

అడ్డుకుంటే ఊరుకోం..

దళితులను చిన్నచూపు చూస్తూ మా ప్రాంతంలో అభివృద్ధిని అడ్డుకుంటే చూస్తు ఊరుకోం. ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ నియోజకవర్గంలో దళిత వాడలపై ఇలా చిన్నచూపు చూడడం సరికాదు. కేవలం దళిత వాడలే కదా అన్న ఒకేఒక కారణంతో ఇక్కడ పనులు అడ్డుకుంటున్నట్లు తెలుస్తోంది. కూటమి నేతల ఆదేశాలతో అధికారులు మా ప్రాంత అభివృద్ధిని ఆపేస్తున్నారు. వెంటనే పనులు ప్రారంభించక పోతే ఉద్యమిస్తాం.

– వజ్రపు భువనేశ్వరి వీరేష్, 30వ వార్డు
కౌన్సిలర్, పిఠాపురం అగ్రహారం

వంద రోజుల పనిదినాలు కల్పించాలి



గోర్సలో కూలీలతో మాట్లాడుతున్న అధికారులు

కొత్తపల్లి: మండలంలోని గోర్స గ్రామంలో శుక్రవారం మన ఊరు– పనితీరు, పారదర్శక బోర్డులను ఏర్పాటు చేసే కార్యక్రమాన్ని ఎస్ఆర్‌పీ, డీఆర్‌పీలు ప్రారంభించారు. అలాగే గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. మౌలిక సదుపాయాలు, విద్య, కమ్యూనికేషన్, లక్ష్యాలు, ప్రయోజనాలు, నూతన అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఉపాధి హామీ పథకం ఏపీఓ కొండలరావు మాట్లాడుతూ శ్రామికులకు వంద రోజుల పని కల్పించాలన్నారు. రోజువారీ వేతనంగా రూ.307 ఇస్తారన్నారు. ముఖ్యంగా ఉపాధి పనులు చేసేవారిని శ్రామికులుగా పిలవాలన్నారు. పనికావాలన్న ప్రతి ఒక్కరికీ పని కల్పించాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. ఉపాధి పనులపై అవగాహన కల్పించినప్పుడే అవకతవకలను నియంత్రించవచ్చన్నారు. సర్పంచ్ రొంగల వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

నేడు మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

పెద్దాపురం: స్థానిక పురపాలక సంఘ సర్వసభ్య సమావేశం శనివారం మున్సిపల్ చైర్ పర్సన్ బొడ్డు తులసీ మంగతాయారు అధ్యక్షతన జరుగుతుందని కమిషనర్ శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ ఉదయం 11 గంటలకు జరిగే ఈ సమావేశానికి మున్సిపల్ కౌన్సిలర్లు, ఆయా విభాగాల అధికారులు తప్పక హాజరు కావాలని కోరారు.

సేవ ఇదేనా!



పీబీ దేవంలో రైతు భరోసా కేంద్రం వద్ద బిహార్ వ్యవసాయ కూలీలు, వంటలకు సిద్ధంగా పాత్రలు

సామర్లకోట: రైతు భరోసా కేంద్రాలు... ఈ పేరు చెప్పగానే రైతుల మోములో ఆనందం వెల్లివిరిసేది. ఇక్కడి నుంచే రైతులకు కావాల్సిన సేవలన్నీ అందేవి. ఇది వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో మాట. ఇప్పుడు కూటమి ప్రభుత్వం వచ్చాక రైతు భరోసా కేంద్రాలను నిర్వీర్యం చేస్తోంది. ఇందులో భాగంగా మండలంలోని పీబీ దేవం గ్రామంలో రైతు భరోసా కేంద్రాన్ని వ్యవసాయ కూలీలకు అడ్డాగా మార్చింది. ప్రస్తుత ఖరీఫ్‌లో రైతులు కూలీల ద్వారా వరి నాట్లు వేయించడానికి నిర్ణయించారు. వెదజల్లు పద్ధతిలో నాట్లు వేస్తే ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు మొలకలు దెబ్బతినే అవకాశం ఉందని భావిస్తున్నారు. దీనికితోడు వెదజల్లు పద్ధతితో కేళీలు ఎక్కువగా వస్తున్నాయని రైతులు కూలీలతో వరి నాట్లు వేయడానికి నిర్ణయించారు. ఈ మేరకు కొంత మంది దళారులు బిహార్ నుంచి కూలీలను మండలానికి తీసుకువచ్చారు. ఈ కూలీలు వేగంగా వరి నాట్లు వేయడంతో పాటు వీరికి ఎకరానికి 10 కిలోల విత్తనం సరిపోతుంది. స్థానిక కూలీలకు ఎకరానికి 25 కిలోల విత్తనం అవసరం అవుతుంది. ఈ మేరకు పీబీ దేవం గ్రామానికి 30 నుంచి 35 మంది బిహారీ కూలీలు రావడంతో వారు నివాసం ఉండటానికి గ్రామంలోని రైతు భరోసా కేంద్రం విడిదిగా ఇచ్చారని ఎంపీటీసీ సభ్యుడు మలకల సూరిబాబు, మాజీ సొసైటీ అధ్యక్షుడు మలకల వరహాలబాబు ఆరోపించారు. రైతులకు సేవలు అందించాల్సిన కేంద్రాన్ని ఇలా మార్చడం ఏంటని అంటున్నారు. రైతు భరోసా కేంద్రంలో వంటలు చేసుకోవడానికి పాత్రలు తీసుకు వచ్చి అక్కడ పెట్టారన్నారు. వ్యవసాయ కూలీలు ఉండటానికి గోదావరి కాలువ గట్టు ఆవలి వైపు ఒక షెడ్డు, గొల్లపేటలో రెండు షెడ్లు ఉన్నాయని రైతులు తెలిపారు. దీనిపై మండల వ్యవసాయాధికారి వి.మురళీధర్‌ను వివరణ కోరగా తాను కొత్తగా బాధ్యతలు స్వీకరించడం వల్ల పూర్తిగా విషయం తెలియదన్నారు. గతంలో పనిచేసిన ఏఓ వద్ద నుంచి సమాచారం తీసుకుంటానన్నారు. బదిలీ అయిన ఏఓ సత్యను వివరణ కోరగా తనకు ఎటువంటి సంబంధం లేదన్నారు.

13న కవలల సమ్మేళనం

బాలాజీచెరువు: వాసవీక్లబ్ ఆధ్వర్యంలో జూలై 13న కవలల సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు ఇంటర్నేషనల్ అడ్మిన్ వైస్ ప్రెసిడెంట్ నాళం అండాళ్ తెలిపారు. స్థానిక సినిమా రోడ్‌లోని సూర్యకళా మందిరంలో కవల పిల్లల పెంపకం, అలాగే వారి జీవనశైలి, సంప్రదాయ వస్త్రధారణ, స్టోరీ టెల్లింగ్, జోడీ డ్యాన్స్‌కు సంబంధించి ఐదు విభాగాల్లో పోటీలు నిర్వహిస్తామన్నారు. ప్రతిభ చూపిన వారికి నగదు బహుమతులు అందజేస్తామన్నారు. 25 ఏళ్ల లోపు కవలలు పాల్గొనవచ్చని అన్నారు.

ఆర్టీసీ బస్సుల్లో ప్రత్యేక రాయితీలు

బోట్‌క్లబ్ (కాకినాడ సిటీ): ఆషాఢ మాసం సందర్భంగా ఆర్టీసీ బస్సుల్లో ప్రత్యేక రాయితీలు ఇస్తున్నట్లు కాకినాడ డిపో మేనేజర్ ఎంయూవీ మనోహర్ శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 28 నుంచి జూలై 26 వరకూ ఈ ప్రత్యేక రాయితీ ఉంటుందన్నారు. కాకినాడ నుంచి హైదరాబాద్, కర్నూల్, బెంగళూరు, తిరుపతి వెళ్లే వెన్నెల, అమరావతి, ఇంద్ర, వంటి సర్వీసులకు 10 శాతం రాయితీ ఉంటుందన్నారు. ఈ అవకాశాన్ని ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలను చేర్పించాలి



విద్యార్థినికి బ్యాగ్ అందజేస్తున్న దృశ్యం

సామర్లకోట: ప్రభుత్వ పాఠశాలలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కౌన్సిలర్ బలుసు వాసు అన్నారు. స్థానిక బచ్చు ఫౌండేషన్ మున్సిపల్ హైస్కూల్‌లో సర్వేపల్లి రాధాకృష్ణ విద్యార్థి మిత్ర కిట్ల పంపిణీలో భాగంగా శుక్రవారం విద్యార్థులకు బ్యాగ్‌ల పంపిణీ జరిగింది. ఈ సందర్భంగా స్పెషల్ ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్ నిర్వహించగా, పాఠశాలలో కొత్తగా చేరిన విద్యార్థులకు కిట్లు అందజేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పి మిగిలిన విద్యార్థుల తల్లిదండ్రులకు ఆదర్శంగా నిలవాలన్నారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన హెచ్ఎం తోటకూర సాయిరామకృష్ణ మాట్లాడుతూ పాఠశాలలో 10వ తరగతి ఉత్తీర్ణులైన ముగ్గురు విద్యార్థులకు ట్రిపుల్ ఐటీలో సీట్లు రావడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. ఉపాధ్యాయులు కె.గంగాభవానీ, ఎస్.హరినాథ్, పి.నిర్మల, ఎస్.ప్రశాంతి, సీహెచ్ బబిత, దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



ఉప్పాడలో పేరుకుపోయిన చెత్తను తొలగిస్తున్న పారిశుధ్య కార్మికులు



రోడ్డుపై నిలిచిపోయిన వర్షపు నీటిని తరలిస్తున్న సిబ్బంది

స్పందించారు.. చక్కదిద్దారు

సాక్షి ఇంపాక్ట్

కొత్తపల్లి: ఉప్పాడలో పారిశుధ్య సమస్యతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. దీనిపై 'సాక్షి' దినపత్రికలో శుక్రవారం 'ఉప్పాడ.. సమస్యలే ఎడాపెడా' అనే శీర్షికతో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. ఈ మేరకు ఎంపీడీఓ రవికుమార్ పర్యవేక్షణలో పారిశుధ్య సిబ్బంది రోడ్లపై నిలిచిపోయిన వర్షపు నీటిని, పేరుకుపోయిన చెత్తను తొలగించారు. దీంతో జనం సంతోషం వ్యక్తం చేశారు.

ప్రతి శుక్రవారం డ్రైడే పాటిద్దాం



తడి, పొడి చెత్త, డ్రైడే గురించి గ్రామస్తులకు వివరిస్తున్న డిప్యూటీ ఎంపీడీఓ శ్రీనివాసరావు

కరప: అంటు వ్యాధులు వ్యాప్తి చెందకుండా ఉండాలంటే గ్రామాల్లో ప్రతి శుక్రవారం డ్రైడే పాటించాలని డిప్యూటీ ఎంపీడీఓ ఎస్‌వీ శ్రీనివాసరావు సూచించారు. సిరిపురంలో శుక్రవారం ఆయన పర్యటించి పంచాయతీ సిబ్బందికి డ్రై డే గురించి వివరించారు. గ్రామాల్లోని మంచినీటి పథకం ఓవర్ హెడ్ ట్యాంకులను వారానికొకసారి తప్పనిసరిగా శుభ్రం చేయించాలన్నారు. క్లోరినేషన్ చేసిన తర్వాతే తాగునీరు సరఫరా చేయాలన్నారు. ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించాలన్నారు. గ్రామ కార్యదర్శులు, పంచాయతీ, వైద్య సిబ్బందితో కలసి గ్రామాల్లోని ఇంటింటికీ వెళ్లి నీరు నిల్వ లేకుండా ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. వర్షాకాలంలో నీరు నిల్వ ఉండటం వల్ల డెంగీ, చికెన్ గున్యా, మలేరియా వంటి వ్యాధులకు కారకాలైన దోమలు పెరుగుతాయన్నారు. ఇంటి ఆవరణలో వివిధ పాత్రల్లో నీరు నిల్వ ఉండకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పారిశుధ్య కార్మికులు ఇంటింటికీ వచ్చినప్పుడు తడి, పొడి చెత్త విడదీసి ఇవ్వాలన్నారు. సేకరించిన చెత్తను ఎస్‌డబ్ల్యూపీసీ కేంద్రానికి తరలించాలన్నారు. గ్రామ కార్యదర్శి జి.దుర్గాభవాని, వైఎస్సార్ సీపీ నాయకుడు నున్న వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా కుంకుమ పూజలు





కుంకుమ పూజలు చేస్తున్న మహిళలు. మహాలక్ష్మి అమ్మవారు (అంతర చిత్రం)

పిఠాపురం: స్థానిక చింతావారి వీధిలోని మహాలక్ష్మి గణపతి సహిత సీతారామాంజనేయ ఆలయంలో శుక్రవారం మహాలక్ష్మి అమ్మవారికి సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకుల ఆధ్వర్యంలో వారాహి అమ్మవారి సన్నిధిలో ప్రత్యేక పూజలు చేశారు. ఇందులో అధిక సంఖ్యలో మహిళలు పాల్గొని అమ్మవారి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

అభివృద్ధి పనులకు గ్రహణం

- మున్సిపల్ సమావేశం జరగక ఇబ్బంది
- ఏం చేయాలో తెలియక గందరగోళంలో అధికారులు



సామర్లకోట మున్సిపల్ కార్యాలయం

సామర్లకోట: స్థానిక మున్సిపల్ కౌన్సిల్ రెండో నెల సమావేశం కూడా జరిగే అవకాశాలు కనిపించడం లేదు. మున్సిపల్ చైర్‌పర్సన్ గంగిరెడ్డి అరుణపై 25 మంది సభ్యులు అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టి ఆమోదించారు. అయితే ఈ అవిశ్వాస తీర్మానాన్ని అప్పటి ప్రత్యేకాధికారిగా వ్యవహరించిన కాకినాడ ఆర్డీఓ మల్లిబాబు అధికారికంగా ప్రకటించలేదు. చైర్‌పర్సన్ వివాదం కోర్టులో ఉండడంతో అవిశ్వాస తీర్మానాన్ని అధికారికంగా ప్రకటించడం లేదని చెప్పారు. దాంతో గత నెలలో ఎవరి అధ్యక్షతన కౌన్సిల్ సమావేశం నిర్వహించాలో తెలియక జరపలేదు. అదే విధంగా జూన్ నెలకు సంబంధించి అజెండా కూడా తయారు కాకపోవడంతో ఈనెల కౌన్సిల్ సమావేశం కూడా జరిగే అవకాశాలు కనిపించడం లేదు. ప్రతి నెలా కౌన్సిల్ పాలక మండలి సాధారణ సమావేశం నిర్వహించి అభివృద్ధి పనులకు సంబంధించిన అంశాలపై ఆమోదం తీసుకోవాల్సి ఉంటుంది. కౌన్సిల్ తీర్మానాలకు లోబడి అధికారులు అభివృద్ధి పనులు చేయాలి. ఈ మేరకు కౌన్సిల్ సమావేశంలో చర్చించాల్సిన అభివృద్ధి పనులకు సంబంధించిన అజెండాను తయారు చేసి మున్సిపల్ చైర్‌పర్సన్ ఆమోదంతో ఆమె సంతకం చేసిన తరువాత కౌన్సిల్ సభ్యులకు అజెండాను అందజేస్తారు. సాధారణ సమావేశం నిర్వహించే సమయంలో కౌన్సిల్ సభ్యులకు నాలుగు రోజులు ముందుగా అజెండాను ఇవ్వాలి. అయితే శుక్రవారం నాటికి మున్సిపల్ అజెండా తయారు కాలేదు. దీనిపై ఎవరి సంతకం తీసుకోవాలనే సందిగ్ధంలో మున్సిపల్ అధికారులు గత నెలలో సమావేశం ఏర్పాటు చేయలేదు. గత నెల 15న మున్సిపల్ చైర్‌పర్సన్ గంగిరెడ్డి అరుణ తన పదవికి రాజీనామా చేయడం, అదే రోజు 25 మంది సభ్యులతో ఆమెపై అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టడం జరిగింది. అవిశ్వాస తీర్మానం ఆమోదం పొందడంతో మొదటి వైస్ చైర్మన్ అధ్యక్షతన సమావేశం ఏర్పాటు చేయాలని మెజార్టీ సభ్యులు మున్సిపల్ కమిషనర్‌కు వినతి పత్రం అందజేశారు. గత నెల 16న చైర్‌పర్సన్ అరుణ తన రాజీనామాను ఉపసంహరించుకుంటున్నట్లు మున్సిపల్ కమిషనర్ శ్రీవిద్యకు వినతి పత్రం అందజేశారు. దాంతో ఏ నిర్ణయం తీసుకోవాలో అర్థం కాని పరిస్థితి మున్సిపల్ అధికారులకు ఏర్పడింది. ఈనెలలోనైనా సమావేశం నిర్వహించి, అభివృద్ధి పనులకు ఆటంకం లేకుండా చూడాలని వైస్ చైర్మన్ మోజెస్‌తో పాటు పలువురు కౌన్సిలర్లు కమిషనర్ శ్రీవిద్య దృష్టికి తీసుకు వెళ్లారు. అయితే ఉన్నతాధికారుల నుంచి సమాచారం వచ్చే వరకూ సమావేశం నిర్వహించలేమని కమిషనర్ చెప్పుతున్నారని కౌన్సిలర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చైర్‌పర్సన్, వైస్ చైర్మన్లను మినహాయిస్తే మున్సిపల్ చట్టం ప్రకారం సీనియర్ సభ్యుని అధ్యక్షతన ఎందుకు కౌన్సిల్ సమావేశం నిర్వహించడం లేదని సభ్యులు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికే ఒక సమావేశం నిర్వహించలేక పోవడం, ఈనెలలో కూడా సమావేశం నిర్వహించే అవకాశం కనిపించడం లేదని, వచ్చే నెలలో కూడా అదే జరిగితే మున్సిపల్ చట్టం ప్రకారం కౌన్సిల్ రద్దయ్యే అవకాశం ఉందని పలువురు ఆందోళన చెందుతున్నారు.

ఖాతాదారులకు మెరుగైన సేవలు



నూతన భవనంలో మేనేజర్ మోహన్‌రంగా, ఆర్ఎంలు రమణమూర్తి, ఏఎస్ఎన్ మూర్తి

కాకినాడ రూరల్: సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ద్వారా ఖాతాదారులకు మెరుగైన సేవలందిస్తున్నట్టు రీజనల్ మేనేజర్లు ఏవీ రమణమూర్తి, ఏఎస్ఎన్ మూర్తి అన్నారు. కాకినాడ రూరల్ వలసపాకలలోని బ్రాంచ్‌ను సర్పవరం జంక్షన్ వద్ద నూతన భవనంలోకి మార్పు చేయడంతో శుక్రవారం పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా బ్రాంచ్ మేనేజర్ మోహన్‌రంగా ఆధ్వర్యంలో మీడియా సమావేశంలో ఆర్ఎంలు రమణమూర్తి, ఏఎస్ఎన్ మూర్తి మాట్లాడారు. విశాఖ రీజియన్ పరిధిలో 40 బ్రాంచ్‌లు ఉండగా.. కాకినాడ నగరం, రూరల్‌లో నాలుగు బ్రాంచ్‌లు ఉన్నాయన్నారు. వలసపాకల బ్రాంచ్ ఏర్పాటు చేసిన 12 ఏళ్లలో ఇప్పటికి రూ.63 కోట్ల వ్యాపారం జరిగిందని, రూ.వంద కోట్ల లక్ష్యంతో నూతన భవనంలో సేవలు విస్తృతం చేయనున్నట్టు తెలిపారు. రైతులు, వ్యాపారులు, విద్యార్థులకు రుణాలతో పాటు బంగారంపై రుణాలు అందిస్తున్నామన్నారు.